క్లుప్తంగా

విలసవిల్లిలో ఘనంగా చండీ హోమం



నవగ్రహ నక్షత్ర పూజల్లో చండీ హోమం నిర్వహిస్తున్న పురోహితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో రామాలయం నందు జరుగుతున్న నవగ్రహ నక్షత్ర మహా సౌరయాగంలో 24వ రోజు చండీ హోమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యాగ కర్త ముస్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సూర్యనమస్కారాలు, సూర్య దేవారాధన చేశారు. అనురాధ నక్షత్ర జాతకులచే పొగడ మొక్కకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి పంచామృత నవరస అభిషేకాలు



శ్రీదేవి అమ్మవారిని అభిషేకిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అమ్మవారి జన్మదిన వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం కుంకుమార్చనలు, పంచామృత నవరస అభిషేకాలు వైభవంగా జరిగాయి. కుంకుమ పూజ అనంతరం అమ్మవారికి తొమ్మిది రకాల పండ్ల రసాలు, పంచామృతాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. అమ్మవారిని జల్లెడ ద్వారా పవిత్ర జలాలతో అభిషేకించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వరి చేలను పరిశీలించిన అధికారులు



సరిపల్లిలో వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి, పేరాయిచెరువు గ్రామాల్లో సాగునీరు అందక బీటలు వారుతున్న పొలాలను రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులు మంగళవారం పరిశీలించారు. సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఏవో కుమార్‌బాబు, ఇరిగేషన్ ఏఈ శివరామకృష్ణ, గెడ్డం సురేష్‌బాబు, చీకట్ల రాంబాబు, పెయ్యిల రమణ తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం



పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న అన్నదానం టీమ్ ప్రతినిధి జానీ

అమలాపురం టౌన్: నాలుగేళ్ల కిందట జరిగిన పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్ల జ్ఞాపకార్థం మంగళవారం అమలాపురం అన్నదానం టీమ్ పేదలకు అన్నదానం చేసింది. ఆటోలో భోజన ప్యాకెట్లను తీసుకెళ్లి సుమారు 60 మంది యాచకులు, వీధి పిల్లలు, నిరుపేదలకు అందించారు. తొలుత అన్నదానం టీమ్ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్జానీ(జానీ), టీమ్ ప్రతినిధులు నరేష్, ఆది, రెహ్మాన్‌లు పుల్వామా దాడిలో అమరులైన వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

నిత్యావసరాల ధరల పెంపుతో ఇబ్బందులు

తాళ్లరేవు: గత నాలుగేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో మంగళవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, టి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం



దరియాలతిప్పలో రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి



కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను కలిసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ లక్షలాది రూపాయల ఖర్చుతో రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. మంగళవారం దరియాలతిప్పలో ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో చేపట్టిన సీసీ రహదారుల పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఓఎన్జీసీ సంస్థ ద్వారా వచ్చిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులతో 17 పనులు చేసేందుకు అనుమతి లభించిందన్నారు. వాటిని త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. పట్టణ పరిధిలో గృహాలు నిర్మించుకుని కనీస సదుపాయాలు లేని వివిధ లేఅవుట్‌ల్లో దశలవారీగా విద్యుత్, రహదారుల నిర్మాణాలను చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పండు సిద్దార్థకుమార్, సబ్బతి శ్రీను, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కృతికాశుక్లాను కలిసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో కొన్ని రోజులుగా సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, నీటి విడుదలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి కలిసి విజ్ఞప్తి చేశారు. భౌగోళికంగా యానాంకు సాగునీరు ధవళేశ్వరం కాలువల నుంచి వస్తుందని, కొద్దిరోజులుగా నీటి విడుదల తగ్గిపోవడంతో వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయంటూ సమస్యను వివరించారు. దీనికి స్పందించిన కలెక్టర్ కృతికాశుక్లా ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్‌తో మాట్లాడి యానాంకు సాగునీటి విడుదలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంపీ అనురాధని కలిసిన మోడేకుర్రు గ్రామస్తులు



ఎంపీ అనురాధకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న మోడేకుర్రు గ్రామస్తులు

అల్లవరం: కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామస్తులు మొగళ్లమూరులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ అనురాధను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.15 లక్షల నిధులు మంజూరు చేసినందుకు ఎంపీ అనురాధకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీని కలిసిన వారిలో కుడుపూడి వెంకటేశ్వరరావు, చిక్కాల వెంకటేశ్వరరావు, ఎల్.శ్రీను, ముంగర సూరిబాబు, జక్కంశెట్టి గంగారమేష్, జక్కంశెట్టి కొండబాబు తదితరులున్నారు.

ధనలక్ష్మి, కల్యాణలక్ష్మి ప్రతిష్ఠ పూజలు



దనలక్ష్మి, కల్యాణలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ పూజలు చేస్తున్న పండితులు

యానాం: యానాం రామరాజుగార్డెన్స్‌లో నూతనంగా నిర్మించిన ధనలక్ష్మి, కల్యాణలక్ష్మి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చింతా బుల్లెయ్య, వెంకటలక్ష్మి దంపతుల కుమారులు నెలకొల్పిన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా వైఖానస ఆగమ భాస్కర శ్రీమాన్ సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, సర్వదేవతాప్రార్థన, చతుర్వేద పారాయణ, శాంతి హోమం తదితర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో చింతా వెంకటగణేష్, చింతా శివ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే ఆశయాలను ముందుకు తీసుకెళతాం

ముమ్మిడివరం: డా.బీఆర్ అంబేడ్కర్, పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే విముక్తి చిరుతల క్షి పార్టీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి నల్లా వారి పేటలో మంగళవారం జరిగిన పార్టీ జెండా ఆవిష్కరణ సభలో రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక పార్టీలన్నింటినీ ఏకం చేసి ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జైభీమ్‌చంద్ర, నల్లారెడ్డి నాయుడు, సబ్బతి దుర్గారావు, బి.రాంబాబు, కె.త్యాగరాజు పాల్గొన్నారు.

గురుకులాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు



గురుకులాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న డీసీఓ మురళీకృష్ణ

అల్లవరం: గోడిలోని బాలుర, బాలికల గురుకులాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని డీసీఓ మురళీకృష్ణ అన్నారు. గోడిలోని బాలుర గురుకులాలను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంటుని వినియోగంలోకి తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యార్థుల హాస్టల్‌లో ఫ్యాన్లు, లైట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్లంబింగ్ పనులతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా గ్రౌండ్‌ని మట్టితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల పంచాయతీరాజ్ అధికారులు గురుకులాన్ని సందర్శించి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో మౌలిక సౌకర్యాల కల్పన పనులు బుధవారం నుంచి జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అమరావతి ప్రధాన కార్యాలయ అధికారి యోగేంద్ర, ప్రిన్సిపాల్ సాయిబాబు, వార్డెన్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కిత్తనచెరువు పంచాయతీ పరిధి సీతారామపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎలిపే లోవరాజు తన భార్య, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్న తాటాకిల్లు సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. మంటల్ని గమనించిన లోవరాజు భార్య హుటాహుటీన భర్తను, పిల్లలను నిద్రలేపి కట్టుబట్టలతో బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో అమలాపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగిందని స్థానిక వీఆర్వో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. లోవరాజు కుటుంబీకులను జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు పరామర్శించి నిత్యావసర సరకులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు దుస్తులు, వంట సామగ్రిని బాధిత కుటుంబానికి ఇచ్చారు.

ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: నగరం సచివాలయం-2లో కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు 252 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులు ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలకు తోడు ప్రైవేటు ఆస్పత్రులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు పాల్గొన్నారు.

పందుల పందెం నిర్వహణ: ముగ్గురిపై కేసు

అయినవిల్లి: మండలంలోని క్రాపలో పందుల పందెం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన బండి ఏసు, బండి మణి రక్షణ ఆనంద్, గుత్తుల మీరయ్యలు పందుల పందెం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై పందెం నిర్వహణ స్థలానికి తన సిబ్బంది వెళ్లి పందెం నిర్వాహణను నిలుపుదల చేశారు. నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు.

సాగునీరు అందించేందుకు చర్యలు



రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

ఉప్పలగుప్తం: రబీ సాగుకి ఆటంకం లేకుండా నీరందించేందుకు అధికారులంతా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సాగునీటి ఎద్దడిపై మంగళవారం రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న మునిపల్లి, చల్లపల్లి, పేరాయిచెరువు, చినగాడవిల్లి, గోపవరం, సరిపల్లి తదితర గ్రామాల్లో శివారు ప్రాంతాలకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వంతుల వారీ విధానాన్ని అమలు చేస్తే వ్యవసాయానికి ఆటంకం లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మానే శ్రీను, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఏవో జి.కుమార్‌బాబు, ఇరిగేషన్ ఏఈలు శివరామకృష్ణ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీలు



జార్జిపేటలో సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆదినారాయణ మూర్తి

తాళ్లరేవు: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ అనే కార్యక్రమాన్ని వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. మంగళవారం పలు సచివాలయాల్లో సైకిల్ ర్యాలీలు ఉత్సాహంగా నిర్వహించారు. జార్జిపేట పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి మాట్లాడుతూ రోజూ అరగంట పాటు సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. యోగా, శారీరక వ్యాయామంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం సచివాలయం నుంచి సెయింట్ జోసెఫ్ స్కూల్ వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మందపల్లి నాగమ్మ, నాయకులు పెట్ల సూర్యనారాయణ రాజు, దడాల జగదీశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

రేపు ఉచిత గ్రహణమొర్రి వైద్య శిబిరం

అల్లవరం: ముమ్మిడివరంలోని మండల రిసోర్సు కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత గ్రహణమొర్రి వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్, బసవతారంక ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో సమగ్ర శిక్షాభియాన్ డాక్టర్ ముకుందరెడ్డి పర్యవేక్షణలో వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ఆరు నెలల వయసున్న పిల్లల నుంచి 50 ఏళ్ల వయసున్న పెద్దల వరకూ శిబిరానికి హాజరవ్వొచ్చని చెప్పారు.

ఆహార పదార్థాలను వృథా చేయొద్దు

అమలాపురం రూరల్: శుభకార్యాలు జరిగినపుడు మిగిలిపోయిన ఆహార పదార్థాల్ని వృథా చేయొద్దని చిందాడగరువు చెందిన సామాజిక కార్యకర్త మోటూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కనకదుర్గ దంపతులు అన్నారు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో శుభకార్యాలు చేసుకునే వారు కార్యక్రమం ముగిశాక తమకు ఫోన్ చేస్తే మిగిలిపోయిన ఆహార పదార్థాల్ని తీసుకెళ్లి వృద్ధులకు, పేదలకు అందిస్తామని చెప్పారు. 78158 75412, 78159 73911 నెంబర్లకు ఫోన్ చేసి తమకు సమాచారమివ్వాలని కోరారు.

ముత్యాలమ్మ నేత్ర దర్శనం



అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

అమలాపురం రూరల్: రోళ్లపాలెం గ్రామంలో ఉన్న గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి నేత్ర దర్శనం వైభవంగా జరిగింది. మంగళవారం గ్రామ ప్రజలు అమ్మవారికి చలివిడి, పానకాలు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మౌనిక

అంబాజీపేట: జాతీయ స్థాయి అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీలకు అంబాజీపేట కొర్లపాటివారిపాలెనికి చెందిన మీసాల మౌనిక ఎంపికైనట్లు బాస్కెట్ బాల్ కోచ్, పీడీ రెడ్డిపల్లి ప్రసాద్ తెలిపారు. ఇటీవల ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఫెడరేషన్ అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంది. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చడంతో జాతీయ స్థాయికు ఎంపికైందన్నారు. త్వరలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననుందని ప్రసాద్ చెప్పారు. మౌనిక అమలాపురం శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో 8వ తరగతి చదువుతుందన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన మౌనికను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్, గ్రామస్తులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్

తాళ్లరేవు: ఈ నెల 11, 12 తేదీల్లో కడప జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను చొల్లంగిపేట జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీధర్ అభినందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలో పాఠశాలకు చెందిన సుమారు 25 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో, ముగ్గురు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గర్వకారణమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణనిస్తున్న పీఈటీ నీలిమను అభినందించారు.

పందులకు వ్యాధి నిరోధక టీకాలు



నడవపల్లిలో పందులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారులు

కాట్రేనికోన: ఇటీవల క్లాసికల్ స్వైన్‌ఫ్లూ వ్యాధి విజృంభించడంతో అధిక సంఖ్యలో పందులు మృత్యువాత పడుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో కాట్రేనికోన పశువైద్యాధికారి ఆకుల రమేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి మంగళవారం నడవపల్లిలో 70 పందులకు క్లాసికల్ స్వైన్ ఫ్లూ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ వారం రోజుల్లో మండలంలోని 200 పందులకు వ్యాక్సిన్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో నడవపల్లి గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ గొలకోటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



లావణ్య, హాసినిలను అభినందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: విజయవాడలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో అమలాపురం జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఐ.లావణ్య, బి.హాసినిలు మూడో స్థానం సాధించారు. విద్యార్థినిలిద్దరూ బాలికల బాస్కెట్ బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వారిని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉప విద్యాశాఖాధికారి సాల్మన్ రాజులు అభినందించారు. ఈ జట్టుకు కోచ్ మేనేజర్‌గా వీరమల్లు నరసింహారావు, పీడీ గారపాటి శ్రీదేవి వ్యవహరించారు.

ఏపీజేఏసీ కమిటీకి అభినందనలు



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాస్ తదితరులు

అమలాపురం రూరల్: ఏపీజేఏసీ కోనసీమ జిల్లా నూతన కమిటీని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసిన ఏపీజేఏసీ ప్రతినిధులు కమిటీ ఎన్నిక గురించి తెలియజేశారు. దీంతో కలెక్టర్ హిమాన్షు శుక్లా వారికి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, అసోసియేట్ సెక్రటరీ శేఖర్, కమిటీ సభ్యులు సత్యశ్రీనివాస్, కొండయ్య, రాంబాబు, నాగలక్ష్మి ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: పురుగుల మందు తాగి అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. మండలంలో లంకాఫ్‌ఠానేల్లంక శివారు కూనాలంకకు చెందిన నల్లా వెంకటేశ్వరరావు(41) ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లిన తన భార్య భానుమతి ఫోన్‌లో మాట్లాడకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కళాశాలను ప్రభుత్వం పరం చేయడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ పరం చేసే దాకా పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల సమావేశం పేర్కొంది. ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పూలే అంబేడ్కర్ భవనంలో జరిగిన సదస్సులో పలువురు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కొందరు ప్రయాణం చేస్తున్నారని వాటిని విరమించుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘాల సలహాదారుడిగా తాడి సహదేవ్‌ను నియమించారు. సమావేశంలో దేవ రాజేంద్రప్రసాద్, నల్లి శివకుమార్, రాపాక మహేష్, పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర, సంజయ్, పవన్, నవీన్, మణికంఠ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

అయినవిల్లి: పంటల సంరక్షణలో సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఉద్యాన శాఖ అధికారి ఎం.బబిత అధ్యక్షతన శానపల్లిలంకలో తోటబడి కార్యక్రమం నిర్వహించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ పసుపు రంగు అట్టలు పెట్టడం, వేపనూనె పిచికారీ చేస్తూ ట్రైకోడెర్మ విరిడీ వంటి జీవ నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా మంచి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త మమత కొబ్బరిలో కంద పంటను నాటే విధానం విత్తన శుద్ధి, సస్యరక్షణ చర్యలు మొదలగు అంశాలను రైతులకు సూచించారు. ఎస్సీ సబ్ ప్లాన్‌లో రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పచ్చిమాల సుబ్బారావు, ఉద్యాన సహాయకులు శ్రీనుబాబు, ప్రసాద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.